



# "మారబోని అగ్రిమెంటు"

ఇందుమతికి చక్రధరానికి పెద్దలు చైత్ర మాసంలో సర్వాంగ సుందరమైన పెళ్లి చేసేశారు. కన్యాదాన ఫలితం దక్కిందని సంతోషించాడు వధువు తండ్రి వర్ధ మాన రావు!

పదివేల రూపాయలు కొడుకుచేత తాళి కట్టించడంతో లాభించాయికదా అని సంబ రంతో మీసాలు దువ్వు కున్నాడు వరునినాన్న కామితార్థశర్మ!

భర్త కొట్టినా తిట్టినా మెచ్చుకున్నా అందలం ఎక్కించి ఊరేగించినా ఏంచేసినా ఏమన్నా సహించి గర్భంధరించి తొమ్మిది నెలలు మోసి ఆమరునాడు ఒక శుభసమయంలో అంటే ఇన్‌స్టన్ చర్చిల్ కానిస్టేబిల్ జౌకర్‌కి ఉరిశిక్ష విధించిన మంచి ఘడియలలో తాను పదేపదే మూలుగుతూ బాధతో పెంకులెగిరేలా అరుస్తూ మధ్యమధ్య కాఫీ ఓవల్టిన్‌లు త్రాగుతూ భగవంతుణ్ణి ప్రార్థించు కుంటూ కన్న గారాలకూచి అత్త మామలనూ మొగుణ్ణీ సంపాదించుకుంది! కన్నె చెఱవదిలింది! కాటికో కాశీకో నిస్సంకోచంగా ప్రయాణించ వచ్చు! మనవడొ మనవరాలో పుట్టిన పిదవ తెలుసుకొని వస్తే రావచ్చు-చస్తే చావచ్చు! వస్తే తనపేరో కాక తన గొడుగు పేరో పట్టు పట్టి పెట్టించుకోవచ్చు! అని అనుకుని కునుకు తీసింది పెండ్లికూతురి తల్లి పెద్ద బంగారమ్మ!

భర్త ఆడదాన్ని కనవే మహామారీ నిత్యం అఘోరించి అగ్రహించి అనుగ్రహించి సమ గ్రంగా నిగ్రహిస్తూన్నా అలకించక-తిలకిం చక విలాపించక-ప్రలాపించక సప్తమినిక్రమించి అష్టమీ తిథి ప్రవేశిస్తూండగా వెస్టెండు వాచీ రాత్రి ఒంటిగంటా అయిదునిముషాల అరు సెకన్లు చూపిస్తూండగా మైమరచి ప్రస వించిన అబ్రహాంలింకన్‌ను పోలిన ముద్దుల బిడ్డడు బ్రతికి బట్టకట్టి చదివి చదవక చట్టు బండలు చేసి చేయక తిరిగి తిరగక మొరిగి మొరగక కరిచి కరవక గొడకుర్చీలు వేసి వేయక చీపురు దెబ్బలు మొట్టికాయలు తిని కిమ్మనక ఒకసారీ తుమ్మక ఇంత వాడై ఇన్ని ఏళ్లకి చెయినా ఇండియాని కబళించా లనే దురుద్దేశంతో సైన్య సమీకరణ జరుపు కుంటూన్న దుర్దినాలలో తన కోరిక కాదనక మధుపర్కాలతో పీటలమీద ఉపవసించి తన కోడలి మెడలో సూత్రం విడిపోని మూడు ముడులువేసి లేవడం - అందరికి వందనాలు

రచయిత:
బాలకోటేశ్వరరావు

నిలిచి కూర్చుని వంగి పడుకుని ఆచరించి ఆపసోపాలు కొపతాపాలు పొందక పొరుగింటి పుల్లమ్మగారి అడపడుచు ఎల్లమ్మ మేపుకొనే తువ్వాయిలా ఐరవై అయిదుగురు స్త్రీ పిశా చాల నడుమ సతీసమేతుడై పెండ్లాం ఎంగిలి నెమరువేసి బ్రహ్మగారు మతిమరుపు తనంతో చదివించిన తద్దినం మంత్రంతోనే ఆపోసనం పట్టి కిక్కురు మనకలేచి ఫుట్‌బాల్ టేబిల్ టెన్నిస్ క్రికెట్ చెడుగుడి గోళీకాయలు గొటీ బిళ్లలు మాత్రమే ఆడుతానని పంతగించక 'సరి-చేసి' ఆటనే నిష్కల్మషంగా చిరు నవ్వుతో ఆడి జడిపోతూన్న సమయంలో తాను చాటుగా సమర్పించిన అదనపు సొమ్ముతో గప్‌చిప్‌గా గెలిచి పూబంతులతో శ్రమపడి అర్ధశేరు కాఫీ సునాయాసంగా త్రాగి వినాయకుడై సైడు పోజులు ఫ్రంట్ పోజులు బాక్‌పోజులు ఇస్తాను అని అనక ముగ్ధత్వంతో కోడలుపిల్ల కొంగుకి అంగుళం దూరంలో ఆముదంజిడ్డు నాకిన సోమరి పోతులా నిల్చుని ఫొటోలో బ్రహ్మరాకసునిలా పడి వియ్యాలవారు బహూ కరించిన గజం మూడు పాతికలసైను గుడ్డనే మనుగుడు పులకు తగిన మూడు పూటలూ ధరించి దాని సోయగాన్ని హరించి పీలికలు కాకుండా కనికరించి తనకు సహకరించి సందుకు సాయుజ్యం సిద్ధించినట్లుగా ఆహంకారిం చింది పెళ్లికొడుకు మాతృదేవత చిన్నమా లోకమ్మ!

నేను ఆంజనేయుణ్ణి అశ్వత్థామని అస్ఖలిత బ్రహ్మచారిని వానిని వీనిని అని అనుదినం ఆద్యంతం శ్రవణపేయంగా ఉపన్యసిస్తూ, సన్యసించమని ఎవరైనా పొరపాటున సలహా యిస్తే క్రోధంతో అవమానంతో అసహనంతో విరహంతో ఇచ్చిన వాజమ్మల సమక్షంలో సగం అంగీకరించి ఇల్లు చేరుకున్న పిమ్మట 'ఈబ్రహ్మచర్య వ్రతం పరిపాలించ డం నాతరంకాదురా భగవంతుడా అనుకుని దీనంగా నిట్టూరుస్తూ వివాహంకోసరం ఆరులు చాచిన చక్రధరం తాను గేస్తుగా మారటంతో పొంగి పందిరిపట్టు మంచంపై అటూఇటూ పొరలాడు.

'నీనవమోహ నాంగుడెవరే అంగనా? నీ మనోహరుడేడే నెచ్చెలీ?' అంటూ పగలబడి నవ్వే స్నేహితురాళ్లతో అడుగో చక్రంగాడు- వాడినే పెళ్లాడతాను - ప్రాణం నాలుగు వంతులు తీసి ఒకవంతు దాచుకుంటాను' అని సమాధానించి 'అబ్రూట్‌నా? అక్రాక్‌నా? నువ్వు ఆడేమ్‌ని కట్టుకుని ఏంచేయగలవే త్రిలోక సుందరీ!' అని ఎగతాళిచేసే వాళ్లతో 'ఏమో? వాడు బ్రూటో! లేక బ్రూటస్సో?

క్రాకో్క కాకహిచ్‌కాకో్క? డామో మేడమో్మ? నాకేం తెలుసు! నానిర్ణయం ఇది నా మారేజీకి తప్పక వస్తారుగా అప్పుడు మావారి లింగు లిటుకులు పరికించి పారిపోవుదురు గాని....' అని సమర్థించు కుంటూ తక్కుతూ తారుతూ కాబోయే ప్రాణేశ్వరునితో ఎలా కాపురించాలో నిర్ధరించు కుంటూ తనప్రాణ నాధుని ఎలా బాధించాలో ముందే యోచించు కుంటూ అభ్యంతరం ఎరుగని ఎక్స్‌పర్ట్సుని కార్యక్రమ సూచికలు యాచించుకుంటూ పేవ్‌మెంట్లపై నడవడంమానేసి ట్రాఫిక్ నియమాలకు విరుద్ధంగా యుద్ధం చేసిచేసి చేస్తూచేస్తూ కార్లకు బళ్లకు మనుషులకూ అడ్డువస్తూ పోతూ వత్తులకు పైఎత్తులు సంపాదించడానికై మాజీ ప్రపంచ చతురంగ ఛాంపియన్‌ల గేమ్‌లు సమీక్షిస్తూ కొత్త ఛాంపియన్‌ల ఆటలకొలుకు నిరీక్షిస్తూ ఆహార పానీయాలను ఉపేక్షిస్తు చక్రధరాన్ని అపేక్షిస్తూ సెకన్స్! నిముషాలు! హవర్స్! పూటలు! డేస్! వారాలు! ఫోర్ట్‌నైట్స్! నెలలు! గడిపిగడిపి తల్లి దండ్రుల కండకావరం నఫా చేసి చివరకు నెగ్గి ఘనవిజయలక్ష్మిని తనటాయ్‌లెట్ పీసాలో బంధించి ఆత్మ తృప్తితో పరికిణిలు పమిటలు విసర్జించి చీరలు కట్టటం నేర్చుకుంది ఇందుమతి.

*　　*　　*

చక్రధరం నికరమైన వయస్సు ఇరవై మూడు సంవత్సరాల మూడునెలల ఎనిమిది రోజుల రెండున్నర గంటలు! ఇది అతని ఎస్. ఎస్ ఎల్. సి. రిజిష్టర్‌లో ఉన్న డేట్ ఆఫ్ బర్త్ ప్రకారం గుణించబడింది. అంటే ఆల్ కరెక్ట్!

ఇందుమతికి ఫాల్గుణ బహుళ ఏకాదశీ భాను వాసరంతో రెండు దశాబ్దాలపై ఒక వసంతం పూర్తయింది. రెండవ ఆమని ఆరంభమయింది.

ఇందుమతి కోరికోరి వివాహమాడిన నవ మోహనాంగుడు ఇంటర్ మీడియెట్ నాలుగు సార్లు నిరాటంకంగా కష్టపడి ఫెయిలయి అవిద్యాభ్యాసంగానికి గుడ్‌బై చెప్పేశాడు.

కాని, చక్రధరం సహధర్మ చారిణి బి.ఏ రెండు పర్యాయాలు ప్యాసైంది. ఒకసారి ఎకనమిక్స్ మెయిన్‌తో, మరొకసారి హిస్టరీన్ మెయిన్‌తో, ఈసారి ఇంగ్లీష్ లిటరేచర్ మెయిన్‌గా వెళ్లాలని వాంఛిస్తూంది.

ఈ సంగతి కనిపెట్టిన ఆమె ప్రాణవల్లభుడు 'ససేమిరా వీల్లేదు' అని కబురంపాడు. 'సరే మానేస్తున్నాను, ఏడువకండి' అని ఆరాయబారి ద్వారా సమాధానం ఇచ్చింది. 'ఆహా! నాపత్ని మహాపతివ్రతల జాబితాలో ప్రధమస్థానం పొందాలి! పొందుతుంది! అనుకుని విశ్వసించి నిశ్వసించాడు. పెద్దలు నిర్ణయించారు. ఏమని?- 'ఇందూ చక్రంలకు మిగిలిన ఆడు తొలగించి ఏకంచెయ్యాలని....'' ఇలా నిశ్చయించడానికో కారణం ఉంది. ఆ భార్యా భర్తలు మేనత్త మేనమామల బిడ్డలు. వారి ఇళ్లు ప్రక్క ప్రక్కనే నిర్మించబడినాయి. ఏక్షణంలో ఏంఘోరం ప్రభవిస్తుందో? మనకర్తవ్యం మనం నిర్వర్తిస్తే వాళ్ల ఏడుపు వాళ్లే ఏడుస్తారు! వర్ధమాన రావూ కామితార్ధ శర్మా సమావేశమై పురోహితుని రప్పించారు

'ముహూర్తం మంచిది చెప్పండి!'.... సుముహూర్తం ఫీజుగా చెరిఒక రెండున్నర చంహ వేసికొని సమర్పించుకుని ఆదేశించారు-చిక్కని తవ్వెడు గేదెపాలు, సోలడు సామర్లకోట పంచదార ఆ అయిదుకీ దక్షిణ. అంతలో పోస్టుమన్ నీలయ్యా ఏతెంచి ఆ వియ్యంకుల్లకి రెండు ఇన్‌లాండ్ కవర్లు అందించి వెళ్లి పోయాడు. ఇద్దరూ ఉత్తర దక్షిణాలకు పోయి ఆ ఉత్తరాలు కంఠస్థం చేసుకుని నవ్వుకున్నారు. ఒకటి చక్రధరం తన తండ్రికి వ్రాశాడు. ఏమనంటే? డియర్ నాన్నాజీ!

అయ్యామ్ సేఫ్‌హియర్; హోపింగ్ దట్‌యు ఆర్‌సేఫ్‌వేర్! మాదంపతులను ఒకే ఒక్క గదిలోకి పంపించడానికి సిద్ధపడిన మీరు వెంటనే ఆపని చేయండి. చేయకపోతే నేను బ్రతకను, నేను బ్రతకకపోతే మీకూ అమ్మకూ అపరకర్మలు చేయడానికి ఎవరూ ఉండరు. ఇది జ్యేష్ఠమాసం, ఎండలు మెండుగా కాస్తూన్నా బాధలేదు. సీలింగ్‌ఫాన్ ఆగదిలో అమర్చితే మెనీమెనీ థాంక్స్.

యువర్స్ లవ్వింగ్లీ,<br>తుమ్‌హారా ప్రియమైనబచ్చా<br>చక్రం....

రెండు: ఇందుమతి తన తండ్రికి వ్రాసిన లేఖ!

పితాజీ!

మా ఆయన మీబావగారికి ఒకలెటర్ ఇవ్వాళే పోస్టు చేశారని తెలిసింది. అందులో ఎలా ఉంటే అలానే చేయండి. చేయకపోతే నేను చేదకందని నూతిలోపడి హరీ అంటాను. ఇంకేం వ్రాయమన్నారు? సిగ్గేస్తూంది.

ఇట్లు<br>'ఇందు'

తా. క:—కరెంటు పెట్టించండి.

ఉత్తరాలు మడిచి జేబులలో దాచుకుని యథాస్థలంలో ఆసీనులయ్యారు వియ్యంకుళ్ళు - ముసిముసి నవ్వులు అటూ ఇటూ పర్యవేత్తాయి. పురోహితుడు ముహూర్తం విషయం ప్రస్తావించాడు.

పౌర్ణమినాటి రాత్రి పది-నలభై నిముషాలకి పనులు జోరుగా జరిగి పోతున్నాయి. బంధుమిత్రులకు శుభలేఖలు అందాయి. వాళ్ళు వచ్చారు. రెండిళ్ళూ సందడితో చిందరవందరౌతూన్నాయి.

నాడే పౌర్ణమాస్య! హడావిడి మూడింతలై వెల్లి విరిసింది.

*　　*　　*

'అల్లుడెక్కడున్నాడమ్మా?'' లోపలకొచ్చిన వర్ధమాన రావుగారు చిన్నమాలోకమ్మని అడిగారు. ఆయన చేతిలో పెద్ద అట్టపెట్టి ఉంది. అది చూపరులను ఆకర్షిస్తూంది.

'వీధిగదిలో కూర్చుని వేరుసెనగ కాయలు తింటూన్నా డన్నయ్యా!' నవ్వుతూ జవాబు చెప్పింది మాలోకమ్మ 'వేరుసెనగ కాయలా? ఇన్ని మిఠాయిలు చేయిస్తూంటే ఆవేదొరికాయా!' గొణుగుకుంటూ చక్రధరం పడక గదిలో ప్రవేశించారాయన.

ఈజీ చెయిర్‌లో కులాసాగా పడుకుని సెనగకాయలతో తిప్పలు పడుతున్నాడు చక్రధరం! అతడు మామగారి రాకనుగుర్తించలేదు.

'అల్లుడూ! ఎలాగుంది ఒంట్లో?'

చక్రధరం త్రుళ్ళిపడి సంబాళించుకున్నాడు, 'ఓ' మామయ్యా! నువ్వా! ఇదిగో-ఇవి తిను. కాసిని మంచినీళ్ళు త్రాగు నిలబడే ఉన్నావేం? ఈమంచం మీదకూర్చో.'

వర్ధమాన రావుగారు ఉపవిష్టులయ్యారు.

'నీశరీరంలో ఎలాఉంది అల్లుడూ?' రెండవసారి అడిగా రాయన. చక్రధరాన్ని ఈ ప్రశ్న ఆక్రమించి కంగారు పెట్టింది. 'అదేమిటి మావయ్యా! అలా అడుగుతున్నావ్? నా ఒంట్లో శీతోష్ణాలు సరిసమానంగా రన్నే అవుతూంటే!'' ఆశ్చర్యంతో అన్నాడు.

వర్ధమానరావుగారు మాటాడలేదు. ఆపెకెట్ ఏమిటి మామయ్యారూ ?" ఆయన చేతులలో నిది బలవంతంగా లాగుకుని విప్పుతున్నాడు ఆతురతతో. "నేను వస్తాను. నాకు చాలా పనుంది. ఏది ఏమయినా నీ ఆరోగ్యం ఈ మూడు రోజులూ జాగ్రత్తగా చూసుకో!' లేచారాయన.

"గుడ్! ఈ త్రీడేస్ పూర్తైతే నా ఆరోగ్యం సంగతి ఎవరికీ అవసరం లేదనేగా మీరం టూంట-" చక్రధరం ముఖం కోపంతో ఎర్రగా కందింది. అబ్బే, ఆతర్వాత మా అమ్మాయి ఇష్టప్రకారమేగా నువ్వు జీవించడం....అందు కని"-గుటకలు మ్రింగుతూ నిష్క్రమించారు.

"ఈ మావాజీస్ అందా. ఇంతే, వీళ్లవంశం లవణ సాగరానికి ప్రతిబింబం. మొదట అమృతం, తదుపరి హాలాహలం ఉద్భవిస్తాయి. తాళికట్టే వరకూ 'బాబూ! బాబూ!' అని అప్యాయంగా పిలుస్తారు. తర్వాత నాయనా! దశమగ్రహం" అని మెటికలు విరుస్తారు. వీళ్లనేచర్ తెలియని వాళ్లే నాబోటి అల్లుళ్ళు పూర్‌క్రీచర్స్....'

గాజుకుప్పెలోని వేరుసెనగ గుళ్ళు గుప్పెడు నోటిలో పొసుకుని నములుతూ అట్టపెట్టిమూత తెరిచాడు. నిర్ఘాంతపోయి నిలువెల్ల వణకాడు. అంగుళం మందాన పేర్చబడిన పచ్చగడ్డి ఒత్తిగించి లోపలి ఉత్తరం తీశాడు. అది తప్ప మరొకటేం దొరక లేదు.

నిరాశా నిస్పృహలు తాండవిస్తూంటే ఆ ఉత్తరం చదువుకొని ఎగిరి గంతేశాడు. నూత నోత్సాహం అతనిలో ఉద్దీపించింది.

'మై డియర్ హజ్‌బెండ్!

నీకోసం మన వటవృక్షంక్రింద నిరీక్షిస్తూం టాను. వేగిరం వస్తే ముఖ్యమైన విషయాలు చర్చిస్తాను.

ఇట్లు నీ
ఇందూ."

ఆ ఉత్తరాన్ని నాలుగుసార్లు ఓపికతో పఠించుకున్నాడు. చప్పుడు కాకుండా దానిని ముద్దాడాడు.

'అదేంరా బుజ్జీ! ఏదో కాగితం ముద్దెట్టుకుం టున్నావు?' తల్లి కంఠం చక్రధరానికి విన పడింది, తెల్లబోతూ ఉత్తరాన్ని జేబులో దాచేసుకున్నాడు. నవ్వటానికి ప్రయత్నించి విఫలుడయ్యాడు....

'అమ్మా! ఈ సెనగగింజలు తింటూండు. ఇప్పుడే వచ్చేస్తాను.' సమాధానానికి ఎదురు చూడకుండా దౌడు తీశాడు. క్షణంసేపు నిర్విణ్ణురాలై చిన్న మాలోకమ్మ తెలివిలోకి వచ్చి అర్థమైనట్లుగా నవ్వుంది!

*   *   *

ఎక్కడకురా అంత పరుగుతో పోతున్నావ్? —కామితార్ధ శర్మగారు తనయుణ్ణి తత్తర పాటుతో పృచ్ఛించారు, తండ్రి అంటే చక్ర ధరానికి అమిత భక్తి తాత్పర్యాలు ఉన్నాయి. కనుకనే అగి నమస్కరించాడు వినమ్రుడై. ఆనందతుందిలమైన డెందంతో ఆ వందనాన్ని స్వీకరించి ఆశీర్వదించారాయన - 'శీఘ్రమేవ సంతాన ప్రాప్తిరస్తు.'

చక్రధరం ఆ ఆశీస్సును అవధరించి మెలి కలు తిరిగాడు. 'అంత సిగ్గుపడతావేంరా? సంతానం కలగడం నీకె మంచిది. పున్నామ నరకంనుండి పూర్తిగా విముక్తి పొందుతావు, తెలుసా?'

'తెలుసు. నాన్నారూ, తెలుసు. నేను సిగ్గు పడడం లేదు. చింతిస్తున్నాను....ఐ మీన్.... ఆలోచిస్తున్నాను.'

'ఆలోచిస్తున్నావా ? అఘోరిస్తున్నావా?'

'రెండూ చేయడంలేదు. నిశ్చయిస్తు న్నాను.' చక్రం జవాబులోని అంతర్యాన్ని అవగాహించుకోలేక బొద్దు మీసాలు నవరించు కున్నారు శర్మగారు.

'ఏమని?' 'సంతానంవలన లాభమా? నష్ట మా? అని.'

'ఈ చిన్న విషయాన్ని గురించి ఆలోచిస్తు న్నావా? ఆ సంతానం లాభదాయకమని నేనే నిర్ణయించానుగా! నా నిశ్చయమే నీ నిశ్చ యంగా భావించి యిక లోపలకుపోయి విశ్ర మించు' బోధించారు శర్మగారు.

'విశ్రమించమంటున్నారా! వీల్లేదు .... ఇందూ పిలుస్తూంటే వెళ్లకుండా విశ్రమిం చనా? నాన్నారూ! రెండు దీవనలు ఇలా పడే యండి, ఎందుకైనా మంచిదే....'

ప్రశ్నించకుండా కామితార్ధ శర్మగారు పర్సు తీసి రెండు పచ్చకాగితాలు కొడుకుకిచ్చారు ....చక్రం సుదర్శన చక్రంలా పరుగెత్తాడు.

'పిచ్చి బుర్రలు....కుర్ర కుంకలు....రాయ బారాలు....ఉత్తరాలు .... ఈ రాత్రినుండైనా బెడద నగం తగ్గుతుంది—'

*   *   *

వచ్చేశా ఇందూ వచ్చేశా!!—చెమట తుడుచుకుంటూ ఆయాసంతో చెప్పుతూ అన్నాడు కథా నాయకుడు.

అప్పుడే విరిసిన మల్లెపూవులా మనోజ్ఞంగా నేత్రపర్వమైంది ఇందుమతి. క్షీరసాగర మథ నంలో లభించిన శ్రీదేవిలా నిగనిగలాడు తూంది.

రాకెట్‌లోంచి ఊడిపడిన పేకెట్‌లా వేంచే సిన భర్తనుచూచి ముహూర్తమాత్ర లజ్జా సంకోచాలతో బలబలబలాడింది ఆమె మనస్సు. నిబ్బరంతో చూడజాలనన్నాయి ఆమె కలువ కనులు. తడితో మెరసే ఎర్రని పెదిమలు పతి సమక్షంలో తమ భవిష్యత్తు కంపిస్తూ ప్రదర్శించాయి. మునిపంట అధరాన్ని అదుముకుంటూ శిరను వంచేసుకుంది ముగ్ధ నాయిక ఇందుమతి!

"రమ్మన్నావుగా ఇందూ! వేరుసెనగ కాయలు తింటూతింటూ నీ ఉత్తరం చదువు కుని తినడం మానేసి మా నాన్న రెండు దీవన లిస్తే పాకెట్‌లో పడేసుకుని పరుగుపరుగున వచ్చేశాను. అవునుగాని మతీ! రెండు పంక్తుల లెటర్, నలభైరెండు ఆశీర్వచనాలు ఎలా పడేసినా మింగ గలిగిన ఆ అట్టపెట్టెలో పెట్టి చుట్టూ పచ్చగడ్డితో మూసి పంపించాల్సిన అవసరం ఏముంది? మన సరిహద్దులు కాపలా కాసే కుక్కతోనో, లేక మీ బట్టలు మా బట్టలు కరాబ్‌చేసే కాకమ్మతోనో ఒక్కమాట చెప్తే నాకు తెలిసేదిగా, అట్టపెట్టె అర కానులు; పచ్చగడ్డి అర కానీ; తెల్లకాగితం కానీ; సిరా నయాపైసాలో నాలుగోవంతు; ఇలా ఎకౌంట్ వేయడం ఆరంభిస్తే రూపాయివరకూ దేకు తుంది. ఇది దండగ కాదూ? ఎవరు తిన్నట్లు? ఎవరికి పెట్టినట్లు' ఘాటుగా ఉపన్యసిస్తూన్న చక్రధరం వదనభంగిమలు క్రీగంటితో తిల కించి నవ్వుకుంది ఇందుమతి (డబిల్ బి ఏః) మెల్లిగా అడిగింది.

'ఇంతకీ నేనేగా దుబారాకర్చు చేసేదాన్ని?'

'నో, నో!! నువ్వని నే నన్నానా? నువ్వూ నేనూ ఒకటేగా! నువ్వు చేస్తే నేను చేసినట్లే. అందుకని నన్ను నేను మందలించుకుంటు న్నాను....త్వమేవాహం, త్వమేవాహం, త్వమే వాహం నసంశయః'

పకపక నవ్వింది ఇందుమతి. ఆమెలో సిగ్గుబొగ్గులైంది. తొంభైనంవత్సరాలు కాపురం చేసి చేసి విసుగెత్తిన భార్య భర్తతో ఎలా మాటాడుతుందో అలాగే ప్రసంగించింది. 'మై డియర్ హజ్‌బెండ్! నీతో కొన్ని విష యాలు మాట్లాడాలని పిలిచాను.'

'ఇందూ! నువ్వు నాకంటే అన్ని రంగాల లోనూ పెద్దదానివే. ఒక్క వయస్సులో మాత్రం నేనే పెద్ద. అదీకాక నేను నీ మనో నాధుణ్ణి. నోరారా ఏమండీ, అని పిలవక హజ్ బెండ్! జీలుగుబెండ్!! నీ లైఫ్ నేటితో ఎండ్!!!

అని అనేస్తూంటే నా అవయవాలు అవమా నంతో ఆవేశిస్తున్నాయి. 'దట్స్ వై' నువ్వు నన్ను 'ఏమండీ ఇట్టారాండి ఈ కూర రుచి చూడండి, ఈ చీర కొనిపెట్టండి, ఈ చామంతి పూలు కొనుక్కోనాండి, సినిమాకి వెళ్దా మాండి!!' అని గౌరవంతో సంబోధిస్తే నా మానసం సంతోషంతో తేలి తేలికకాదూ? దయఉంచి నా మతి!..........' చక్రధరం మర్యాద తనకియమని బాధతో అర్థించాడు.

'ఎలా పిలవమంటావ్? నాకు అలవాటు లేదు. అలవాటులేని పని ఆచరించడం నా కిష్టంలేదు. ఇంకా నయం హజ్‌బెండ్ అని పిలుస్తున్నాను. తృప్తిపడు. దురాశపడకు. దుఃఖానికి మూలం దురాశ. పెళ్ళి అవడానికి పూర్వం నిన్ను ఎన్నిసార్లు వెధవా? బోడీ? అని నేను పిలవలేదూ? ఎక్కువగా కోపంవస్తే చీపురుకట్టతో మా నాన్న పొన్నుకర్రతో మా అమ్మ పులుసుగరిటెతో నా పుస్తకాలతో నీ కెన్నిసార్లు దేహశుద్ధిచేశానో జ్ఞాపకముందిగా! నేను నిన్ను చక్రం అని ముచ్చటగా పిలుస్తాను. నువ్వు నన్ను ఇందూ అని ప్రేమతో పిలు. అప్పుడు మన సంసారం సాగరంకాక సరస్సు అవుతుంది.' గడగడ చెప్పింది.

'సాగరమో సరస్సో....నాకేదైనా ఇష్టమే! నువ్వు నన్ను ఏమండీ అనే పిలవాలి.' చక్రధరం హుంకరించాడు. అతని తల గిర్రున తిరుగుతూంది. ఒళ్లంతా సెగలు చిమ్ముతూంది.

'నేనలా పిలవను ఒరేయ్ బావా! ఇలారా చక్రం! అని పిలుస్తాను' సవాల్ చేసింది ఇందుమతి.

చక్రధరం ఉద్రిక్తుడయ్యాడు—'నువ్వు వెధవ బి. ఏ; రెండుసార్లు పాసయ్యావు. నేను ఇంటర్ నాలుగుసార్లు ఫెయిలయ్యాను. అంటే నేనే ఘనుణ్ణి. నాలెడ్జి నాకే ఎక్కువ ఉంటుంది. తెలిసిందా?'

'తెలిసింది. అయితే జూలియస్ సీజర్ డ్రామా అప్పగించు.' విద్యార్థిని ఉపాధ్యాయుడు అడిగినట్లు అడిగింది.

'నేను నీ స్టూడెంటునుకాను. నీ అవసరం నాకు లేదు. నా అవసరంవస్తే ఏమండీ అని సంబోధించి మరీ ఉత్తరం వ్రాయి. ఎడ్రస్ గుర్తుంచుకో. నేను పోతున్నాను. పోయిపోయి సన్యాసుల్లో కలుస్తాను" బెదిరించాడు.

"నా కిబ్బందేంలేదు. మన దేశంలోని సన్యాసులు నీతో మూడు కోట్లు ఔతారు.... త్వరగా వెళ్ళు. ట్రెయిన్ దాటిపోతుందేమో!"

కుతకుత ఉడుకుతూ చక్రధరం బట్టలు సర్దేసుకున్నాడు. సూట్‌కేస్ పట్టుకుని హాల్లోకి వచ్చాడు. అతన్ని చూసి ఆత్మీయులు బంధుమిత్రులు అందరూ ఆశ్చర్యపోయారు.

'ఎక్కడకురా చక్రం!' చక్రధరం తల్లికి తోడబుట్టిన భూలోకంగారు ప్రశ్నించారు.

'ఆనంద కాననానికి—' రెండు రెళ్లు నాలుగు అన్నంత సులభంగా జవాబు చెప్పాడు....'అంటే....' ఒక ముత్తయిదువ అర్థం కాక సాగదీసింది.

'బెనారెస్ అంటే కాశీ' తడుముకోకుండా విశదీకరించాడు. 'ఎందుకూ' అతనికి ఓనమాలు నేర్పిన బృందావనం మాష్టారు నివ్వెరపాటుతో అడిగారు.

'మన్నించండి మాష్టారూ! మన్ను తినేందుకు....' చక్రం నిర్విక్రంగా నిట్టూర్చాడు.

* * *

'నాన్సెన్స్. నావంటి బ్యూటిఫుల్ డబుల్ బి. ఏ; తాళి కట్టించుకున్నందుకు గర్వించక ఇలా పిలు! అలా పిలు!! అని ఆజ్ఞాపిస్తున్నాడు ఫూల్!!!' నణుగుకుంటూ సామాను పుచ్చుకుంది. నిర్విచారంగా బండి ఎక్కింది ఇందుమతి.

'ఇదేనా నీ నిశ్చయం?' గద్గదస్వరంతో అడిగారు వర్ధమానరావుగారు.

'అవును నాన్నా. ఇదే నా డిసిషన్. పోనీ వోయ్ బండి' ముఖం త్రిప్పేసుకుంది. బండి కదిలింది.

'ఏమండీ! అమ్మాయి....'మిగిలినమాటలు పైకి రాలేదు పెద్ద బంగారమ్మకి. కనులనుండి నీళ్లుమాత్రం కడివెడు వచ్చాయి.

'ఏడవకే ఏడవకు. అమ్మాయి ఎమ్. ఏ; చదవడానికి కాశీ వెళ్తూంది' ఓదార్చారు రావుగారు.

'మరి ముహూర్తం ఏం కావాలండీ?'

భార్య అమాయకత్వానికి భర్త నవ్వుకున్నాడు.

* * *

రైలు పరిగెడుతూంది. అది ఫస్ట్‌క్లాస్ కంపార్టుమెంటు. అందులో ఇద్దరే ప్రయాణీకులు కూర్చున్నారు. యువకుడు ఏమేమో యోచిస్తూ శూన్యంలోకిచూస్తున్నాడు. యువతి చెమ్మగిల్లిన కళ్లను జేబురుమాలుతో ఒత్తుకుంటూంది. అకస్మాత్తుగా తలలెత్తి ఒకేసారి ఒకరొకరు చూసుకున్నారు. ఇద్దరికీ పోయిన ప్రాణాలు తిరిగి వచ్చాయి, కుదుటబడ్డారు.

'ఏమండీ! ఎక్కడకండీ!! మీరూ బెనారెస్ కేనా! నిజంగా సన్యాసం స్వీకరిస్తారా?' అడగలేక అడగలేక అడిగిందా యువతి.

'ఔను....నువ్వూ సన్యాసానికేనా? కాశీ వచ్చేస్తున్నావా?' పశ్చాత్తాపంతో ప్రశ్నించాడు యువకుడు.

'కాదండి. ఎమ్. ఏ; చదవడానికి;' నవ్వటానికి యత్నించింది. యువకుడు మాటాడలేదు. అదేదో స్టేషన్‌లో ట్రయిన్ ఆగింది.

'పోనీ, మనం వెనక్కి వెళ్లిపోగూడదటండీ?' యువతి మెల్లగా వినయంతో అర్థించింది.

'ఊహూఁ వెళ్తే నీ తాహతు తగ్గిపోదూ?' 'తగ్గేపోయిందిగా. రండి. ఇక్కడ దిగేసి హాయిగా హనీమూన్ ఎంజాయిచేసి ఇంటికి టిక్కట్లు కొనుక్కుందాం....ఏం? నా మాట వినండి.' యువతిలేచి యువకునకు చేయందించింది. యువకుడు కరిగి నీరయ్యాడు. 'పద ఇందూ! మన ఇళ్లకి మనం కలుసుకున్నట్లు టెలిగ్రాంలు ఇచ్చి రెండు నెలలు అక్కడకీ ఇక్కడికీవెళ్ళి కాలక్షేపంచేసి గూళ్ళు చేరుకుందాం ...కాని ఒక్క షరతు' చక్రం ఆగాడు. 'ఏమిటండీ అది?' నిర్విణ్ణతతో ప్రశ్నించింది ఇందుమతి.

'ఇట్లాగే నేనూ నువ్వూ బ్రతికున్నంతకాలం నువ్వు నన్ను పిలవాలి. ఒరేయ్ బావా! ఇలా రా చక్రం!! అని పిలుస్తే నే నూరుకోను....'

'మీరూ అంతే! ఒసేవ్, ఏమేవ్, రావే! పోవే! అంటే నేనూ ఊరుకోను....'

'అయితే ఈ అగ్రిమెంటు జీవితాంతం ఖాయమేనా?'

'అటు సూర్యుడిటు పొడిచినా సప్తసముద్రాలు ఏకమై ప్రపంచాన్ని ముంచేసినా మన నూతిలో నీరు ఇంకిపోయినా మన అగ్రిమెంటు మరోలా మారదు....రండి'ఇందుమతి ఉల్లాసంతో రైలు దిగింది.

'అమ్మయ్య! బ్రతికాను. ఈ బ్రహ్మచర్య వ్రతం తప్పదేమో అనుకుని ఏడుస్తున్నాను. గాడ్ నానిడ్ గ్రహించాడు. నన్ను అనుగ్రహించాడు.' చక్రధరం భగవంతునికి నమస్కరించుకుంటూ దిగి సామాను దింపాడు. ఒకళ్ల కొకళ్ళు అనుకుని ఒయ్యారంగా పోతూన్న ట్రయినువంక కృతజ్ఞతాదృష్టులు కోకొల్లలుగా ప్రయోగించారు.

ధూమశకటం దూరమైంది. ప్రేమ పిపాస ఈ జంటలో ముదిరింది. ప్రకృతి విరగబడి హసించింది. ★